# థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ లేఖ

### ప్రార్థన, కృతజ్ఞత

1 పౌలు, సిల్వాను మరియు తిమోతిల నుండి మన
తండ్రియైన దేవునికి మరియు యేసు క్రీస్తు
ప్రభువుకు చెందిన థెస్సలొనీకయుల సంఘానికి:
2మన తండ్రియైన దేవుడు, యేసు క్రీస్తు ప్రభువు
మీకు అనుగ్రహము, శాంతి ప్రసాదించు గాక!
3సోదరులారా! మీ విశ్వాసం రోజు రోజుకు అభివృద్ధి
చెందుతోంది. మీ మధ్య ఉన్న ప్రేమ వర్ధిల్లుతోంది.
కనుక మీ విషయంలో మేము దేవునికి అన్నివేళలా
కృతజ్ఞతగా ఉండాలి. 4మీరు ఓర్పుతో సహిస్తున్న హింస
లను గురించి, కష్టాలను గురించి విశ్వాసాన్ని గురించి
మేము పొగడుతూ దేవుని ఇతర సంఘాలకు చెపుతూ
ఉంటాము.
5దేవుడు న్యాయంగా తీర్పు చెబుతాడన్న దానికి
ఇది సాక్ష్యం. మీరు దేనికొరకు వీటిని అనుభవిస్తున్నారో
ఆ రాజ్యానికి దేవుడు మిమ్మల్ని అర్హులుగా చేస్తాడు.
6దేవుడు నీతిమంతుడు. మిమ్మల్ని కష్టపెట్టిన వాళ్ళకు
కష్టం కలిగిస్తాడు. 7ఆయన మనందరి కష్టాలు తొలిగి
స్తాడు. ఇది యేసు ప్రభువు పరలోకం నుండి, శక్తిగల
దేవదూతలతో, అగ్ని జ్వాలలతో వచ్చినప్పుడు సంభ
విస్తుంది. 8దేవుడు అంటే ఎవరో తెలియని వాళ్ళను,
మన ప్రభు యేసు సువార్తను అంగీకరించని వాళ్ళను
ఆయన శిక్షిస్తాడు. 9వాళ్ళు ప్రభువు సమక్షంలో నుండి,
ఆయన గొప్పశక్తి నుండి దూరమై శాశ్వతంగా నాశనమై
పోతారు.
10ఆయన వచ్చినప్పుడు ఆయన విశ్వాసులు
ఆయనతోసహా మహిమను పొందుతారు. అప్పుడు
ఆయనయందు విశ్వసించినవాళ్ళు ఆయన్ని చూసి
దిగ్భ్రాంతి చెందుతారు. మేము చెప్పిన సందేశాన్ని
మీరు కూడా విశ్వసించారు కనుక మహిమను పొందే
వాళ్ళలో మీరు కూడా ఉన్నారు.
11ఇది మనస్సులో పెట్టుకొని తాను పిలిచిన పిలు
పుకు తగినట్లు మీ జీవితాలను నడుపమని మేము
దేవుణ్ణి ప్రతి రోజూ ప్రార్థిస్తూ ఉంటాము. అంతేకాక,
మీరు మంచి చేయాలని ఆశిస్తూ కోరుకొన్న ప్రతి
కోరికను, విశ్వాసం వల్ల మీరు చేస్తున్న ప్రతి కార్యాన్ని
దేవుడు తన శక్తి ద్వారా పూర్తి చేయాలనీ ప్రార్థిస్తూ
ఉంటాము.
12మీ ద్వారా మన యేసు క్రీస్తు ప్రభువు మహిమ
పొందాలని, మీకు ఆయన ద్వారా తన మహి మలో
భాగం కలగాలని మేము ప్రార్థిస్తూ ఉంటాము. ఇది
మన దేవుని అనుగ్రహం వల్ల, యేసు క్రీస్తు ప్రభువు
యొక్క కృప వల్ల సంభవిస్తుంది.

### పాప పురుషుడు

2 సోదరులారా! మన యేసు ప్రభువు రాకను
గురించి, ఆయనతో జరుగబోయే సమావేశాన్ని
గురించి మీకు కొన్ని విషయాలు చెప్పాలి. 2ఎవరైనా
వచ్చి తమకు మేము ఏదైనా ఉత్తరం వ్రాసినట్లు లేదా
ప్రభువు రానున్నదినం వచ్చినట్లు తెలిసిందని చెప్పినా,
లేక ఆత్మద్వారా ఆ విషయం తెలిసిందని చెప్పినా,
లేక ఆ విషయాన్ని గురించి మిమ్మల్ని ఎవరైనా
వారించినా భయపడకండి. దిగులు చెందకండి.
3మిమ్మల్ని ఎవ్వరూ ఏ విధంగా మోసం చేయకుండా
జాగ్రత్త పడండి. దేవుని పట్ల తిరుగుబాటు జరిగి, ఆ
నాశన పుత్రుడు, దుష్టుడు కనిపించేదాకా ఆ రోజు
రాదు. 4అంతేగాక దేవునికి సంబంధించిన ప్రతిదానిపై
ఆ భ్రష్టుడు తనను తాను హెచ్చించు కొంటూ మంది
రంలో ప్రతిష్ఠించుకుని తానే దేవుణ్ణని ప్రకటిస్తాడు.
5నేను మీతో ఉన్నప్పుడు ఈ విషయాలన్నీ
చెప్పాను. మీకు జ్ఞాపకం ఉంది కదా? 6ఆ భ్రష్టుని
రాకను ఏది అడ్డగిస్తుందో మీకు తెలుసు. సరియైన
సమయానికి రావాలని వాని రాక ఆపబడింది. 7వాని
అధర్మం రహస్యంగా పనిచేస్తూ తన శక్తిని చూపటం
అప్పుడే మొదలు పెట్టింది. దాన్ని అడ్డగించే వాడు
ఒకాయన ఉన్నాడు. వాణ్ణి అడ్డగిస్తున్న వాడు తీసివేయ
బడేదాకా ఆయన వాణ్ణి అడ్డగిస్తూనే ఉంటాడు.
8అప్పుడు ఆ భ్రష్టుడు కనిపిస్తాడు. యేసు ప్రభువు
వాణ్ణి తన వూపిరితో హతమారుస్తాడు. యేసు తేజోవం
తంగా ప్రత్యక్షమై ఆ భ్రష్టుణ్ణి నాశనం చేస్తాడు. 9ఆ
భ్రష్టుడు సైతాను శక్తితో వచ్చి రకరకాల మహాత్కా
ర్యాలు చేస్తాడు. దొంగ చిహ్నాలు, అద్భుతాలు చేసి
మోసం చేస్తాడు. 10నాశనం కానున్న వాళ్ళను అన్ని
విధాలా మోసం చేస్తాడు. వాళ్ళు సత్యాన్ని
ప్రేమించటానికి, దేవుని రక్షణను స్వీకరించటానికి
నిరాకరించారు కనుక నశించిపోతారు. 11ఈ కారణంగా
దేవుడు వాళ్ళకు మోసంచేసే శక్తిని పంపుతాడు. వాళ్ళు
దాన్ని నమ్ముతారు. 12సత్యాన్ని నమ్మక అధర్మంగా
జీవించాలని నిశ్చయించుకొన్న వాళ్ళం దరినీ శిక్షిస్తాడు.

### బలంగా నిలబడండి

13సోదరులారా! ప్రభువు మిమ్మల్ని ప్రేమిస్తు
న్నాడు. మీకోసం మేము దేవునికి అన్నివేళలా కృతజ్ఞ
తతో ఉండాలి. పరిశుద్ధాత్మ మిమ్మల్ని పరిశుద్ధ పరచు
టవల్ల, సత్యంలో మీకున్న విశ్వాసం వల్ల దేవుడు
మిమ్మల్ని రక్షించటానికి కాలానికి ముందే ఎన్ను
కొన్నాడు.

14మన యేసు క్రీస్తు ప్రభువు యొక్క మహిమలో
మీరు భాగం పంచుకోవాలని, మీరు రక్షణ పొందాలనీ,
దేవుడు మా సువార్త ద్వారా మిమ్మల్ని పిలిచాడు.
15సోదరులారా! మేము లేఖ ద్వారా మరియు మా
బోధన ద్వారా బోధించిన సత్యాలను విడువకుండా
నిష్ఠతో అనుసరించండి.
16యేసు క్రీస్తు ప్రభువు, మనల్ని ప్రేమించిన మన
తండ్రియైన దేవుడు మనల్ని అనుగ్రహించి మనకు
అనంతమైన ధైర్యాన్ని, మంచి ఆశాభావాన్ని ఇచ్చారు.
17దేవుడు మిమ్మల్ని ప్రోత్సాహ పరిచి, మంచి పనులు
చేయటానికి, మంచి మాటలు ఆడటానికి, మీకు ధైర్యం
కలుగజేయునుగాక!

## మా కోసం ప్రార్థించండి

3 సోదరులారా! చివరకు చెప్పేదేమిటంటే మా కోసం
ప్రార్థించండి. ప్రభువు సందేశం మీలో వ్యాపించిన
విధంగా త్వరలోనే మిగతా వాళ్ళలో కూడా వ్యాపించి
కీర్తి చెందాలని ప్రార్థించండి. 2విశ్వాసం అందరిలో
ఉండదు. కనుక దుర్మార్గుల నుండి, దుష్టుల నుండి
మేము రక్షింపబడాలని ప్రార్థించండి.
3కాని ప్రభువు నమ్మతగిన వాడు. కనుక ఆయన
మిమ్మల్ని సైతాను నుండి రక్షించి మీకు శక్తి కలిగిస్తాడు.
4మా ఆజ్ఞల్ని పాటిస్తున్నారనీ ఇక ముందుకునూ
పాటిస్తారనీ మాకు నమ్మకం ఉంది. ఈ నమ్మకం
మాకు ప్రభువువల్ల కలిగింది. 5తండ్రియైన దేవునిలో
ఉన్న ప్రేమ, క్రీస్తులో ఉన్న సహనము మీ హృదయాల్లో
నింపబడాలని మా అభిలాష.

## పని చెయ్యటం మీ కర్తవ్యం

6సోదరులారా! యేసు క్రీస్తు ప్రభువు పేరిట మేము
ఆజ్ఞాపిస్తున్నదేమనగా మా నుండి విన్న క్రీస్తు సందేశం
ప్రకారం జీవించక అక్రమంగా జీవిస్తున్న ప్రతి
సోదరునితో సాంగత్యం చెయ్యకండి. 7మమ్మల్ని అను
సరించాలని మీకు బాగా తెలుసు. మేము మీతో ఉన్న
ప్పుడు సోమరులంగా ఉండలేదు. 8అంతేకాక మేము
ఎవరి ఇంట్లోనైనా ఫూరికే భోజనం చేయలేదు. మీలో
ఎవ్వరికీ కష్టం కలిగించరాదని మేము రాత్రింబగళ్ళు
కష్టపడి పని చేసాము. 9మీ నుండి అలాంటి సహాయం
కోరే అధికారం మాకు ఉంది. కాని మీకు ఆదర్శంగా
ఉండాలని అలా చేసాము. 10మేము మీతో ఉన్నప్పుడే,
“మనిషి పని చేయకపోతే భోజనం చేయకూడదు”
అని చెప్పాము.
11మీలో కొందరు సోమరులని విన్నాము. వాళ్ళు
పని చెయ్యక పోవటమే కాకుండా ఇతరుల విషయంలో
జోక్యం కలుగ చేసుకొంటున్నారని విన్నాము. 12వాళ్ళు
ఇతరుల విషయంలో జోక్యం కలిగించుకోరాదని,
తాము తినే ఆహారం పనిచేసి సంపాదించాలని యేసు
క్రీస్తు పేరిట ఆజ్ఞాపిస్తున్నాము. 13ఇక మీ విషయ
మంటారా, మంచి చెయ్యటం మానకండి.
14ఈ లేఖలో వ్రాసిన మా ఉపదేశం ఎవరైనా
పాటించక పోతే అలాంటి వాళ్ళను ప్రత్యేకంగా గమ
నించండి. అలాంటి వాణ్ణి సిగ్గుపడేటట్లు చెయ్యటానికి
అతనితో సాంగత్యం చేయకండి. 15అయినా అతణ్ణి
శత్రువుగా పరిగణించకుండా సోదరునిగా భావించి అతణ్ణి
వారించండి.

## చివరి మాట

16శాంతిని ప్రసాదించే ప్రభువు మీకు అన్ని వేళలా,
అన్ని విధాలా శాంతి ప్రసాదించుగాక! పైగా ఆయన
మీ అందరికీ తోడై ఉండుగాక!
17పౌలను నేను, నా స్వహస్తాలతో మీకు శుభా
కాంక్షలు తెలుపుతున్నాను. నా లేఖలన్నిటిలో నేను
ఇదే విధంగా సంతకం చేస్తాను. ఇది నా పద్ధతి. 18మన
యేసు క్రీస్తు అనుగ్రహం మీ అందరికీ లభించుగాక!